1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health

Best for Readers

THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 174 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 16 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 174 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 16 May 2025 PAGES : 8 PRICE : 3/-


## రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు

# ఆమోదం తెలిపాం

**ఏపీలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు**

**రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్**

**పరిశ్రమల ఆకర్షణే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 15)**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 6వ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు రూ. 33 వేల కోట్లకు పైగా విలువైన 19 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడులు ప్రధానంగా ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రానున్నాయి. వీటి ద్వారా సుమారు 35 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కుతాయని అంచనా. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామికవేత్తలను తిరిగి ఆకర్షించడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. గడచిన 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఆరుసార్లు సమావేశమై, మొత్తం 76 ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు రానుండగా, 4,50,934 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా పూర్తిచేశాయి.

## రేషన్ వ్యవస్థ బలోపేతానికి అందరం కలిసి పని చేద్దాం

**ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతంపై మంత్రి నాదెండ్ల సమీక్ష**

**విజయవాడలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం**

**ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**రూ.46.10 ఖర్చుతో బియ్యం కొని పేదలకు పంపిణీ**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 15)**

అందరి సహకారంతో పీడీఎస్‌ను మరింత పటిష్టం చేస్తామని వెల్లడి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడ కానూరులోని సివిల్ సప్లైస్ భవన్‌లో చౌక దుకాణాల అసోసియేషన్ ప్రతినిధులు, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లతో నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అనేక పల్లెలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలలో ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం కోసం పేద ప్రజలు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిత్యావసరాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం కిలో బియ్యాన్ని రూ. 46.10 పైసలు వెచ్చించి కొనుగోలు చేసి, లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 29 వేల చౌక దుకాణాల ద్వారా నెలకు 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 6,500 మెట్రిక్ టన్నుల పంచదారతో పాటు ఇతర నిత్యావసర వస్తువులను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు.

## ప్రతిపక్షంలో ఉన్నప్పటి కసితో పనిచేయాలి

**ఉత్తమ కార్యకర్తల సమావేశంలో నారా లోకేశ్ ప్రసంగం**

**11 నెలల ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**

**ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని కర్తవ్యబోధ**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 15)**

రాష్ట్ర ప్రభుత్వం గత 11 నెలల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి కసితో పనిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "బాబు సూపర్-6', 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ'లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం," అని తెలిపారు. 11 నెలల ప్రజా ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలకు, వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచామని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పింఛన్ ఇవ్వడం లేదని గుర్తుచేశారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, ఉచిత గ్యాస్ పథకం ద్వారా -మిగతా 2లో



## 18న ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 15)**

ఈ ఏడాది జనవరిలో 100 రాకెట్ ప్రయోగాల మైలురాయిని అందుకున్న ఇస్రో తర్వాతి రాకెట్ లాంచ్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 18 (ఆదివారం)న శ్రీహరికోటలోని షార్ నుంచి పీఎస్ఎల్వీ-సి61ను ప్రయోగించనుండగా ఇది ఇస్రోకు 101వ రాకెట్ ప్రయోగం కానుంది. దీని ద్వారా భూ పరిశీలన ఉపగ్రహం (ఈఓఎస్) రిశాట్-18ను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. శనివారం ఉదయం 7.59 గంటలకు ఈ మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. నిరంతరాయంగా 22 గంటలపాటు కొనసాగిన తర్వాత ఆదివారం ఉదయం 5:59 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఇస్రో అధిపతి నారాయణన్ గురువారం షార్‌కు చేరుకున్నారు. అంతకుముందు ఆయన చెన్నైలో మాట్లాడుతూ.. దేశ భద్రత, ప్రజల అవసరాలే ప్రధాన లక్ష్యంగా ఇస్రో ప్రయోగాలు చేపడుతుందని, ఇతర దేశాలతో పోటీ పడదని పేర్కొన్నారు.



## 9 భారత ఎయిర్ పోర్టుల్లో టర్కీ సంస్థ కాంట్రాక్టు కట్!

**ప్రముఖ గ్రౌండ్ హ్యాండ్లింగ్ సంస్థ సెలెబి ఏవియేషన్ సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దు**

**జాతీయ భద్రత కారణాలను చూపుతూ బీసీఏఎస్ సంచలన నిర్ణయం**

**ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ సహా 9 విమానాశ్రయాల్లో సెలెబి సేవలు**

**టర్కీ సంస్థ, పాకిస్థాన్‌తో ఆ దేశానికి సంబంధాలున్నాయని శివసేన ఆరోపణ**

**తమకు రాజకీయ ప్రమేయం లేదని సెలెబి స్పష్టీకరణ**



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 15)**

దేశంలోని తొమ్మిది ప్రధాన విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందిస్తున్న టర్కీ సంస్థకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టర్కీకి చెందిన సెలెబి నాస్ సంస్థకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భద్రతా విభాగం బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ గట్టి షాకిచ్చింది. "జాతీయ భద్రత దృష్ట్యా సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చిన సెక్యూరిటీ క్లియరెన్స్‌ను డైరెక్టర్ జనరల్, బీసీఏఎస్‌కు ఉన్న అధికారాల మేరకు తక్షణమే రద్దు చేస్తున్నాం" అని మే 15న జారీ చేసిన ఉత్తర్వుల్లో బీసీఏఎస్ పేర్కొంది. ఈ నిర్ణయంతో ముంబై, ఢిల్లీ, -మిగతా 2లో

## ట్రంప్ 'భారత్ జీరో టారిఫ్ ఆఫర్' వ్యాఖ్యలపై స్పందించిన జైశంకర్

**అమెరికా వస్తువులపై భారత్ జీరో టారిఫ్ ఆఫర్ చేసిందన్న ట్రంప్**

**వాణిజ్యపరమైన చర్చలు జరుగుతున్నాయన్న జైశంకర్**

**ఒప్పందం ఇరు దేశాలకు లాభదాయకం కావాలని వ్యాఖ్య**

**తొందరపడి వ్యాఖ్యలు చేయరాదని ట్రంప్ కు పరోక్ష హితవు**



**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 15)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన 'జీరో టారిఫ్' ఆఫర్ల వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పందించారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే అనేక వస్తువులపై భారత్ 'జీరో టారిఫ్‌లు' ఆఫర్ చేసిందని ట్రంప్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై జైశంకర్ స్పందిస్తూ, "రెండు దేశాల మధ్య వాణిజ్యపరమైన చర్చలు జరుగుతున్నాయి. ఇవి చాలా సంక్లిష్టమైన చర్చలు. ప్రతి అంశంపైనా తుది నిర్ణయం తీసుకునే వరకు ఇవి సాగుతూనే ఉంటాయి. వాణిజ్య ఒప్పందం అనేది ఇరు దేశాలకూ పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలి. అది ఖరారయ్యే వరకు దాని గురించి ప్రకటన చేయడం -మిగతా 2లో

## రాష్ట్రపతికి కాలపరిమితులు నిర్దేశించొచ్చా?

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 15)**



రాష్ట్ర శాసనసభలు పంపిన బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితులు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన సంచలన తీర్పునకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రపతి, గవర్నర్లకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలను సర్వోన్నత న్యాయస్థానం కట్టడి చేయడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశ్నలు లేవనెత్తారు. రాజ్యాంగంలోని అధికరణం 143(1) కింద 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధించి.. న్యాయ సలహా కోరారు. ఏదైనా ప్రజాప్రాముఖ్యం ఉన్న అంశంపై 143(1) ప్రకారం సుప్రీంకోర్టు నుంచి న్యాయసలహా కోరే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఈ ప్రశ్నలపై సుప్రీంకోర్టు.. రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

**రాష్ట్రపతి లేవనెత్తిన ప్రశ్నలివే..**

1. రాజ్యాంగంలోని అధికరణం 200 కింద బిల్లుసమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగ ప్రత్యామ్నాయాలేమిటి?
2. అధికరణం 200 కింద బిల్లు సమర్పించినప్పుడు తనకున్న అధికారాలను వినియోగించే అవకాశం గవర్నర్‌కు ఉన్నప్పుడు ఆయన మంత్రిమండలి సలహాకు కట్టుబడి ఉండాలా?
3. అధికరణం 200 కింద తనకున్న రాజ్యాంగ విచక్షణాధికారాన్ని గవర్నర్ వినియోగించడం న్యాయ పరిశీలన పరిధిలోకి వస్తుందా?
4. అధికరణం 200 కింద గవర్నర్ చర్యలపై న్యాయసమీక్షను రాజ్యాంగంలోని అధికరణం 361 పూర్తిగా నిషేధిస్తుందా?
5. రాజ్యాంగపరంగా నిర్ణీత కాలపరిమితి లేనప్పుడు, అధికరణం 200 ప్రకారం గవర్నర్‌కు ఉన్న అధికారాలపై న్యాయపరమైన ఉత్తర్వుల ద్వారా కాలపరిమితులను విధించవచ్చా.. అది ఎలా అమలు చేయాలన్న విధానాన్ని సూచించవచ్చా?
6. అధికరణం 201 ప్రకారం రాష్ట్రపతి రాజ్యాంగ విచక్షణాధికారాన్ని వినియోగించుకోవడం న్యాయ పరిశీలన పరిధిలోకి వస్తుందా?
7. రాజ్యాంగం ప్రకారం నిర్ణీత కాలావధులు లేనప్పుడు అధికరణం 201 ప్రకారం రాష్ట్రపతికి ఉన్న విచక్షణాధికారాలపై న్యాయపరమైన ఉత్తర్వుల ద్వారా గడువులు విధించవచ్చా.. అది ఎలా అమలు చేయాలన్న విధానాన్ని సూచించవచ్చా?
8. రాజ్యాంగపరంగా రాష్ట్రపతి తన అధికారాలను వినియోగించే సమయంలో అధికరణం 143 కింద సుప్రీంకోర్టు సలహా కోరాలా? ఆమోదం లేదా తిరస్కరణ కోసం గవర్నర్ బిల్లును పంపినప్పుడు సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని రాష్ట్రపతి తీసుకోవాలా?
9. చట్టం అమల్లోకి రాకముందే అధికరణం 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను కోర్టులు పరిశీలించడం సరైందేనా? ఒక బిల్లు చట్టంగా మారకముందు అందులోని -మిగతా 2లో

## కాల్పుల విరమణపై కీలక నిర్ణయం తీసుకున్న భారత్-పాక్

**భారత్-పాక్ సరిహద్దుల్లో కాల్పుల నిలుపుదల పొడిగింపు**

**ఇరు దేశాల డీజీఎంఓల మధ్య మే 10 నాటి ఒప్పందం కొనసాగింపు**

**విశ్వాసం పెంపొందించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం**

**సరిహద్దుల్లో అప్రమత్తత స్థాయిని తగ్గించడం లక్ష్యం**

**పరిస్థితులు మెరుగుపడ్డాక తదుపరి సమాచారం అందిస్తామన్న అధికారులు**

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 15)**

భారతదేశం, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సరిహద్దుల వెంబడి పరస్పర సైనిక చర్యలను నిలిపివేస్తూ ఇటీవల కుదిరిన ఒప్పందాన్ని పొడిగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు రెండు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) స్థాయి అధికారుల మధ్య అవగాహన కుదిరింది. మే 10వ తేదీన ఇరు దేశాల డీజీఎంఓల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు సరిహద్దుల్లో కాల్పుల విరమణ అమలవుతోంది. తాజాగా, ఈ ఒప్పందాన్ని మరింత కాలం కొనసాగించాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇరు దేశాల మధ్య విశ్వాసం పెంపొందించే చర్యలనుకొనసాగించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. "మే 10న ఇరు దేశాల డీజీఎంఓల మధ్య కుదిరిన అవగాహనకు అనుగుణంగా, సరిహద్దుల్లో అప్రమత్తత స్థాయిని తగ్గించేందుకు వీలుగా విశ్వాసం పెంపొందించే చర్యలను కొనసాగించాలని నిర్ణయించాం. పరిస్థితులు మరింత మెరుగుపడిన కొద్దీ, తదుపరి సమాచారం మీకు తెలియజేస్తాం" అని అధికారులు పేర్కొన్నారు. ఈ చర్య ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించి, స్థిరత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

## ప్రతిపక్షంలో ఉన్నప్పటి కసితో పనిచేయాలి

లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, జూన్ మాసంలో 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ' పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. పాఠశాలలను మూసివేస్తున్నారంటూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని లోకేశ్ కార్యకర్తలకు సూచించారు. "ఒక్క పాఠశాలనూ మూసివేయడం లేదు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం" అని ఆయన అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేయలేని పనులను తమ ప్రభుత్వం 11 నెలల్లోనే చేసి చూపిందని, 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చామని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయని, అనంతపురానికి రూ.22 వేల కోట్ల భారీ సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టు, విశాఖకు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తున్నాయని, రాబోయే ఐదేళ్లలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, జనసేన పార్టీలతో కూటమి పటిష్టంగా ఉందని, నామినేటెడ్ పదవుల విషయంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని, కార్యకర్తల త్యాగాల వల్లే చారిత్రక విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఆయన పునరుద్ఘాటించారు.

## 9 భారత ఎయిర్ పోర్టుల్లో టర్కీ సంస్థ కాంట్రాక్టు కట్!

బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్, కన్నూర్, చెన్నై, గోవాలోని మోపా విమానాశ్రయాల్లో సెలెబి అందిస్తున్న సేవలకు ఆటంకం కలగనుంది. విదేశీ విమానయాన సంస్థలకు, కార్గో ఆపరేటర్లకు కూడా సెలెబి సేవలు అందిస్తోంది. విశాఖపట్నం విమానాశ్రయంలో కూడా కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థ ప్రయత్నిస్తోందని అధికారులు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో, సెలెబి గ్రౌండ్ హ్యాండ్లింగ్ సీఈఓ మంగళవారం ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ కు ఒక లేఖ రాశారు. "సెలెబి నాస్ పూర్తిగా భారతీయ వ్యాపార సంస్థ అని, దీనికి ఎలాంటి రాజకీయ అనుబంధాలు గానీ, ఏ విదేశీ ప్రభుత్వం లేదా దేశ రాజకీయ అభిప్రాయాలతో సంబంధం గానీ లేదని మేము స్పష్టం చేయాలనుకుంటున్నాం" అని ఆ లేఖలో పేర్కొన్నారు. ముంబైలోని ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గం, సెలెబి సంస్థకు ఇచ్చిన కార్యాచరణ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లేఖ రాయడంతో ఈ వివాదం రాజుకుంది. గతంలో భారత్‌తో సైనిక ఉద్రిక్తతల సమయంలో టర్కీ పాకిస్థాన్‌కు దౌత్యపరంగా మద్దతు తెలిపిందని, ఈ నేపథ్యంలో జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉందని శివసేన ఆందోళన వ్యక్తం చేసింది. తమ సంస్థ పూర్తిగా భారతీయుల ఆధ్వర్యంలోనే నడుస్తోందని ఆ ప్రకటనలో తెలిపారు. శివసేన ఎమ్మెల్యే ముర్జీ పటేల్ ముంబై ఎయిర్‌పోర్ట్‌కు రాసిన లేఖలో, "ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇటీవలి శత్రు ప్రకటనల నేపథ్యంలో టర్కీ ప్రభుత్వం పాకిస్థాన్‌కు మద్దతు పలకడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. టర్కిష్ కంపెనీ అయిన సెలెబి నాస్, భారత విమానాశ్రయాల్లో ప్రయాణికులకు, కార్గోకు కీలకమైన గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలను అందిస్తోంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో దీని కార్యకలాపాలు కొనసాగించడం వల్ల సంభావ్య ప్రమాదాలు, బలహీనతలు తలెత్తే అవకాశం ఉంది, వీటిని విస్మరించకూడదు" అని పేర్కొన్నారు.

## ట్రంప్ 'భారత్ జీరో టారిఫ్ ఆఫర్' వ్యాఖ్యలపై స్పందించిన జైశంకర్

తొందరపాటు అవుతుంది" అని ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే వివరించారు. భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తానని ఇరుదేశాలనూ తాను హెచ్చరించానని, ఆ తర్వాతే వారు అంగీకారానికి వచ్చారని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

## రాష్ట్రపతికి కాలపరిమితులు నిర్దేశించొచ్చా?

అంశాలపై న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి న్యాయస్థానాలకు అనుమతి ఉందా?

10. రాష్ట్రపతి, గవర్నర్ రాజ్యాంగబద్ధ అధికారాలు, ఉత్తర్వులను ఏ రకంగానైనా రాజ్యాంగంలోని అధికరణం 142 భర్తీ చేస్తుందా?

11. రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం అధికరణం 200 కింద గవర్నర్ సమ్మతి లేకుండా అమల్లోకి రావొచ్చా?

12. అధికరణం 145(3) ప్రకారం, రాజ్యాంగ అంశాలతో ముడిపడి ఉన్న ప్రశ్నలు ఉన్న ప్రొసీడింగ్స్ ఏ ధర్మాసనం ముందుకు వచ్చినా దాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించడం తప్పనిసరి కాదా?

13. అధికరణం 142 కింద ఉన్న సుప్రీంకోర్టు అధికారాలు కేవలం ప్రొసీజర్ లాకే పరిమితమా? లేదా.. అధికరణం 142 కింద జారీ చేసిన ఉత్తర్వులు ప్రస్తుత సబ్‌స్టాంటివ్ లా లేదా రాజ్యాంగంలోని నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నా చెల్లుబాటవుతాయా?

14. ఒక్క అధికరణం 131 కింద తప్ప కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టు ఇతర అధికార పరిధులను రాజ్యాంగం నిషేధిస్తుందా?

రాష్ట్రపతి ప్రశ్నలను ఖండిస్తున్నాం

-స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కాపాడేందుకు చట్టపరమైన పోరాటంలో పాల్గొనాలని భాజపాయేతర రాష్ట్రాలకు, పార్టీ నేతలకు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువు విధించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలను సంధించడంపై స్టాలిన్ స్పందిస్తూ తన 'ఎక్స్' పేజీలో ఓ పోస్టు చేశారు.

ఎందుకు ప్రశ్నించారంటే..

తమిళనాడు శాసనసభ ఆమోదం తెలిపిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్ద ఉంచుకోవడం సరికాదని గత నెల 8న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 415 పేజీల తీర్పును వెలువరించిన సర్వోన్నత న్యాయస్థానం, రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో లేకుంటే తిప్పి పంపించడమో చేయాలని తీర్పిచ్చింది. బిల్లులను వెనక్కి పంపితే ఎందుకు అలా చేశారనే కారణాలు కూడా చెప్పాలని పేర్కొంది. గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో 14 ప్రశ్నలను రాష్ట్రపతి సంధించారు.

## పంట కాలవను పట్టించుకోరా?

**సంబంధిత అధికారుల సద్దే లేదు**

**అధికారుల అండదండలతో కబ్జాదారులు రొమ్ము విరుస్తున్నారు**




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

తిరుపతి జిల్లా నాయుడుపేటలోని పి వి ఎస్ హాస్పిటల్ పంట కాలవను ఆక్రమించి వంతెన ఏర్పాటు చేసుకొని, హాస్పిటల్‌కు వచ్చేవారి వాహనాలు నిలుపుటకు ప్రభుత్వ స్థలాన్ని వినియోగించుకుంటున్నారు. కబ్జాదారుల కబంధ హస్తాలలో చిక్కుకుని పంట కాలవ కాస్త పిల్ల కాలువగా రూపాంతరం చెందింది. ఇలా ఎవరికి నచ్చినట్టు వారు పంట కాలవను కబ్జా చేసుకుంటూ పోతే రానున్న వర్షాకాలంలో వరద నీరు పోవుటకు దారి లేక జనావాసాల మీదకు వరద నీరు వస్తుందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలువను సంరక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు మాత్రం హాస్పిటల్ యజమాన్యం నుంచి అందుతున్న ముడుపులు మోస్తూ అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు మోస్తున్న ముడుపుల బరువు పక్కన పెట్టి పంట కాలువ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## మంత్రి లోకేష్ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

టిడిపి నేత ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యుల పరామర్శకు గురువారం మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మనబ్రోలులో టీడీపీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 15)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లీష్ చెప్పించారు. అనంతరం ఇంగ్లీష్ డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. ఈ వేసవి కాలంలో కూడా పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న వారి తల్లిదండ్రులకు గ్రంథపాలకుడు డి. కోటేశ్వరరావు కృతజ్ఞులు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాత పాస్టర్ పాలపర్తి రవీంద్రబాబు పిల్లలకు స్నాక్స్ అందించి వారి ప్రేమకు పాత్రులయ్యారు.

### రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జిల్లాకు విచ్చేసిన నేపథ్యంలో

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లాలోని నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టిడిపి మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరిని హత్య చేసిన ఘటనలో వారి కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి గురువారం పరామర్శించారు. మంత్రి వీరయ్య చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు తెలియచేశారు.

నాగులుప్పలపాడు మండలం, చదలవాడలోని సాయి విష్ణు విల్లాస్ చతుర్వాటిక హెలిప్యాడ్ ప్రదేశం, హెలిప్యాడ్ నుంచి అమ్మనబ్రోలు వరకు ఉన్న రూట్ ను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి కాన్వాయ్ వెళ్లే మార్గంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా, రూట్ & రూఫ్ టాప్ ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రోన్ కెమెరాలతో నిఘా, హెలిప్యాడ్, వి.ఐ.పి రూట్ బందోబస్తు, పార్కింగ్ ప్రదేశాలలో భద్రతాపరమైన అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు తెలియచేసారు. ఎక్కడ ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అందరూ తమకు కేటాయించిన పాయింట్ల వద్ద అప్రమత్తంగా మెలగాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, మహిళా పియస్ డిఎస్పీ రమణ కుమార్, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, డిఎస్పీలు, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు రూరల్ సీఐ యన్ శ్రీకాంత్ బాబు, సీఐలు, ఆర్ఐ రమణారెడ్డి, సీతారామిరెడ్డి, యన్ జి పాడు ఎస్ఐ శ్రీకాంత్, ఎస్ఐలు మరియు సిబ్బంది ఉన్నారు.









షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# విధేయతకు ప్రతిఫలంగా ఆప్యాయత

## కొండపి శూరుడికి నారా లోకేష్ అశీస్సులు



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మే 15)

రాజకీయాలు అనేవి మాటలకన్నా కర్మలతో నిలిచే వేదిక. అందులోను ప్రజాప్రతినిధిగా పని చేయడం అంటే..తలవంచకుండా నిలబడటం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ప్రతికూలతల మధ్య నిబద్ధత నిలబెట్టుకోవడం. ప్రత్యేకించి రిజర్వు నియోజకవర్గాల్లో నుంచి వచ్చిన నాయకులకు ఈ మార్గం మరింత కఠినతరం. కానీ కొండెపి నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు, ప్రస్తుత మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి ఈ మార్గాన్ని శాసించటమే కాక, ప్రజల్లో ఒక కొత్త నమ్మకాన్ని నాటారు.

**ఐదేళ్ల సవాళ్లు.. ఒక విధేయత గాథ**

వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో గత ఐదేళ్ల కాలంలో ఆయనను ఎన్నెన్నో అవమానాలు చుట్టుముట్టాయి. శాసనసభ గృహంలోనూ, బహిరంగ వేదికల మీదనూ వైసీపీ నాయకుల దురుసు వ్యాఖ్యలు, బెదిరింపులు, ఒత్తిళ్లు... ఇవన్నీ ఎదురైనా ఆయన ఒడిపట్టిన మార్గాన్ని విడువలేదు. ఆయన నాయకత్వంలో టీడీపీ గర్వించదగ్గ ఓ విధేయతా చిహ్నంగా నిలిచింది. శత్రువుల దాడుల కంటే, మిత్రుల మౌనం భయంకరమని అనిపించే రాజకీయ వాతావరణంలో కూడా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పార్టీ పట్ల చూపిన అనురక్తి, నమ్మకానికి మచ్చుతునక.

**లోకేష్ - స్నేహ హస్తంతో**

గురువారం మంత్రి నారా లోకేష్ ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో జరిగిన ఒక చిన్న సంఘటన పెద్ద ఉవ్వెత్తున ప్రజల్లో స్పందన కలిగించింది. ఆ వేళ జనాల మధ్య నుంచి నడుచుకుంటూ వచ్చిన లోకేష్, ముందుగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని ఆప్యాయంగా కౌగిలించుకోవడం. అక్షరాలా ఆ క్షణం ఒక్కసారిగా ఒక భావోద్వేగ సునామిలా మారింది.

"ఈ పార్టీకి నువ్వు చేసిన సేవలకు గర్వపడాలి. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీకి అండగా ఉన్న నేతలెప్పుడూ చిరస్మరణీయులు అవుతారు" అంటూ లోకేష్ చెప్పిన మాటలు అక్కడున్న వారిలో ఎందరికో గుండెలను తాకాయి. అది కేవలం నాయకుడి గుర్తింపు మాత్రమే కాదు, అది విధేయతకు లభించిన ధ్రువీకరణ.

**ప్రజల్లో ఉద్వేగం - పార్టీ బలానికి నిదర్శనం**

ఆ సంఘటన చూసినవారు చప్పట్లు కొట్టడం, సెల్‌ఫోన్‌లతో వీడియోలు తీయడం, సోషల్ మీడియాలో దాన్ని షేర్ చేయడం జరిగింది. ఎందుకంటే, రాజకీయాల్లో నిజమైన అభిమానం కనిపించే సందర్భాలు అరుదు. ఆ క్షణం అలాంటి ఓ అరుదైన సందర్భం. ఇది పార్టీ కార్యకర్తలలో జోష్ నింపిన సంఘటనగా మారింది.

**కొండెపి గర్వించదగ్గ నేత - ప్రజా విశ్వాసానికి ప్రతిరూపం**

డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి ఇప్పుడు ఒక నేతగానే కాక, ఒక నమ్మకంగా మారారు. కష్టాల్లోనూ పార్టీ జెండా ఎగరేసిన నాయకుడిగా, అడ్డంకులనైనా అధిగమించి ప్రజా సేవలో నిమగ్నమయ్యే యోధుడిగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. ఈ సంఘటన పార్టీకి ఆయన చేసిన త్యాగానికి గుర్తింపుగా, నాయకత్వానికి ఆయన విశ్వాసానికి ప్రతిఫలంగా నిలిచింది. రాజకీయాల్లో నిబద్ధతకు గుర్తింపు లభించేది కష్టం. కానీ, ఒకసారి వచ్చింది అంటే అది ప్రజల గుండెల్లో సుదీర్ఘకాలం నిలిచిపోతుంది. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అనేది ఇప్పుడు ఒక పేరు కాదు..అది ఒక ప్రజా నమ్మకానికి ప్రతీక..!!

# వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి లోకేష్

## అన్ని విధాల అండగా ఉంటానని భరోసా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

ఇటీవల ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. గురువారం ఉదయం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని వీరయ్య చౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్ ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర



4



# ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ చేసిన కలెక్టర్

## పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి చూపాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి చూపడంతో పాటు పని ప్రదేశంలో తాగునీరు, నీడ షెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామ పంచాయితీలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ఇనమనమెల్లూరు గ్రామంలో సాగునీటి కాలువ పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీల దగ్గరకు జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ కూలీలు వారి పనిచేసిన పనికి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి లేనిదీ ఆరాతీశారు. అదేవిధంగా కూలీల పనిప్రదేశంలో తాగునీరు, నీడ షెడ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. (తరువాయి 4లో...)



# వ్యవసాయ కనెక్షన్లు, కరెంట్ కోతలు, సూర్యఘర్ పనుల పురోగతి పై సమీక్ష

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## మంత్రి గొట్టిపాటి ఆదేశం




(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 15)

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, విద్యుత్ కోతలు, పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు మంజూరు చేసిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై చర్చించారు. డిమాండ్ మేరకు రైతులకు అవసరమైనన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ సీజన్ నాటికి దరఖాస్తు చేసుకుని, అర్హులైన ప్రతీ ఒక్క రైతుకి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. కరెంట్ కోతలు పై సమాచారాన్ని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో నిరంతరాయ విద్యుత్ (తరువాయి 4లో...)

# నెల్లూరురూరల్‌లో 339 పనులను ఒకేరోజు ప్రారంభించడం ఓ చరిత్ర

పట్టుదల గల ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
రూరల్ వేరు...సిటీ వేరు కాదు...రెండూ ఒకటే
నెల్లూరులోని 54 డివిజన్లను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం
రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
రూరల్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా : ఎంపీ వేమిరెడ్డి
టార్గెట్ 2029 లక్ష్యంగా శ్రమిస్తున్న శ్రీధరెడ్డి : ఎమ్మెల్సీ బీద
శ్రీధరన్న ఎమ్మెల్యేగా ఉండటం రూరల్ ప్రజల అదృష్టం : మేయర్ స్రవంతి
339 అభివృద్ధి పనులు భారత్ సింధూర్ యుద్ధవీరులకు అంకితం : శ్రీధర్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నెల్లూరురూరల్ నియోజకవర్గంలో కేవలం 60 రోజుల్లోనే 339 అభివృద్ధి పనులను ప్రారంభించడం ఒక చరిత్ర అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గురువారం ఉదయం కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 339 అభివృద్ధి పనుల ప్రారంభోత్స కార్యక్రమంలో మంత్రి నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ పొట్లూరి స్రవంతి, జిల్లా కలెక్టర్ ఆనంద్, కమిషనర్ వై ఓబులేసు నందన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డుకాలనీలో 5 కోట్లతో చేపట్టిన సిమెంటురోడ్లు, డ్రైన్లను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఆయా డివిజన్లలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించి ఘనస్వాగతం పలికారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీగా రోడుషో నిర్వహిస్తూ కల్లూరుపల్లికి ప్రజాప్రతినిధులు చేరుకున్నారు. దారిపొడవునూ ప్రజలు ప్రజాప్రతినిధులను జననీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 41 కోట్ల 32 లక్షలతో చేపట్టిన 399 అభివృద్ధి పనులను 60 రోజుల్లో పూర్తి చేయటం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పట్టుదలతో శ్రీధర్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఏడాదిలోపే రూరల్ నియోజకవర్గంలో 231.78 కోట్లతో 816 అభివృద్ధి పనులు చేపట్టడంలో శ్రీధర్‌రెడ్డి సోదరుల కృషిని అభినందించారు. కొండాయపాలెం, భక్తవత్సల నగర్ రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిల ఏర్పాటుకు శ్రీధర్ రెడ్డి చేస్తున్న ప్రయత్నం కూడా త్వరలో ఫలిస్తుందన్నారు. గత ప్రభుత్వం పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మంత్రి నారాయణ మండిపడ్డారు. పరిశ్రమలు వెళ్లిపోవటంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. మూడువేల కోట్ల మున్సిపల్ శాఖ నిధులను కూడా దారి మళ్లించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో రాష్ట్రంలో దార్శనిక పాలన సాగుతోందని, అధోగతి పాల్కైన ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు సీఎం అవిశ్రాంత కృషిచేస్తున్నారన్నారు. 8500 కోట్లతో మున్సిపల్ శాఖలో అమృత్ స్కిమ్ కు కేబినెట్ ఆమోదం తెలిపిందని, ఈ పనులు మొదలుపెట్టి రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. టీడీపీ హయాంలో నెల్లూరులో 5800 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. ఏ మున్సిపాలిటీ నిధులు ఆ మున్సిపాలిటీ అభివృద్ధికే కేటాయించేందుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. నెల్లూరులో అండర్ (తరువాయి 4లో...)

# నెల్లూరురూరల్‌లో 339 పనులను ఒకేరోజు ప్రారంభించడం ఓ చరిత్ర





గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఒక్కరూపాయకే కేటాయిస్తామన్నారు. నెల్లూరు రూరల్, సిటీ వేరుకాదని, నెల్లూరులోని 54 డివిజన్లలో సమగ్ర అభివృద్ధి చేస్తామమని మంత్రి నారాయణ అన్నారు. త్వరలోనే పొట్టేపాలెం బ్రిడ్జి మంజూరు అవుతుందని, నెల్లూరులో బీసీ భవన్ పనులు కూడా మొదలుపెట్టనున్నట్లు మంత్రి చెప్పారు.

**రూరల్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా : ఎంపీ వేమిరెడ్డి**

నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకేరోజు 339 పనులను ప్రారంభించడం ఒక ఘనతగా కొనియాడారు. ఇటీవలే ఆమంచర్ల వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించడం జరిగిందని, ఈ పార్కులో పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ దిశగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కృషిచేస్తారని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో 11నెలల్లోనే 231 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం సామన్యమైన విషయం కాదని, ఇది ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికే సాధ్యమైందని, గొప్ప పట్టుదల ఉన్న వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అని కొనియాడారు. మంత్రి నారాయణ కూడా రాష్ట్రంలో రాజధాని అభివృద్ధి పనులు శరవేగంగా ముందుకుతీసుకెళ్తునారని, ప్రపంచస్థాయి అత్యుత్తమ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ఆయన చేస్తున్న కృషిని ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు లభించడం మన అదృష్టమని, రూరల్ ప్రజలకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దొరకడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా ఎంపీ వేమిరెడ్డి అన్నారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో వుండే వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అని, ఏద్కెనా అనుకుంటే కచ్చితంగా సాధించే వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అని..శ్రీధర్‌రెడ్డితోనే రూరల్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఎంపీ కొనియాడారు. రూరల్ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎప్పుడూ వుంటుందని ఈ సందర్భంగా వేమిరెడ్డి స్పష్టం చేశారు.

**టార్గెట్ 2029 లక్ష్యంగా శ్రమిస్తున్న శ్రీధరెడ్డి : ఎమ్మెల్సీ బీద**

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం సాధారణమని, అయితే అందుకు భిన్నంగా ఒకేరోజు ఆయా ప్రాంతాల నాయకులు, కార్యకర్తల చేత 339 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించడం సరికొత్త ఆనవాయితీ అని, ఇది ప్రజానాయకుడు శ్రీధర్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. శ్రీధర్‌రెడ్డితో తనకు 36 సంవత్సరాల అనుబంధం వుందన్న బీద, తాను విద్యార్థిగా వున్నప్పుడు శ్రీధర్‌రెడ్డి విద్యార్థి సంఘ నాయకుడిగా ఉన్నారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కూడా శ్రీధర్‌రెడ్డి అదే ఉత్సాహంతో ముందుకుసాగుతున్నారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కూడా టార్గెట్ 2029 లక్ష్యంతో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. ప్రజల అవసరాలు తెలుసుకుని పనిచేయమని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతుంటారని, శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఇందుకు ఆదర్శంగా తీసుకోవాలని సీఎం చెప్పడం శ్రీధర్‌రెడ్డి పనితీరుకు నిదర్శనంగా ఎమ్మెల్సీ బీద పేర్కొన్నారు.

**శ్రీధరన్న ఎమ్మెల్యేగా వుండడం రూరల్ ప్రజల అదృష్టం : మేయర్ స్రవంతి**

నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ ఒక గొప్ప మహత్తరమైన కార్యక్రమానికి శ్రీధరన్న శ్రీకారం చుట్టడం నెల్లూరురూరల్ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజుగా స్రవంతి అన్నారు. ఈ 339 అభివృద్ధి కార్యక్రమాల్లో తాము పాలుపంచుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. నెల్లూరు రూరల్ ప్రజలకు శ్రీధరన్న ఎమ్మెల్యేగా వుండడం అదృష్టంగా మేయర్ అన్నారు.

**అందరి సంపూర్ణ సహకారంతోనే నెల్లూరు రూరల్ అభివృద్ధి**

**ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, యువనేత నారా లోకేష్, మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డితో సంపూర్ణ సహకారంతోనే ఈ అభివృద్ధి పనులు పూర్తయినట్లు చెప్పారు. 339 అభివృద్ధి పనులను భారత్ సింధూర్ యుద్ధవీరులకు అంకితం చేస్తున్నట్లు శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మన రాష్ట్రానికి చెందిన వీరజవాన్ మురళీనాయక్ పేరుతో నెల్లూరు రూరల్‌లో ఒక డివిజన్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. నెల్లూరురూరల్ ప్రజలకు సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు శ్రీధర్‌రెడ్డి చెప్పారు. కొండాయపాలెం, బీవీ నగర్ అండర్‌బ్రిడ్జిలు, మెడికవర్ ఆసుపత్రి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణాలను సహకారం అందించాలని ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను శ్రీధర్‌రెడ్డి కోరారు.

నెల్లూరు రూరల్ పరిధిలోని 18 గ్రామాల్లో 3 ఫేజ్ కరెంటు పనుల కోసం 24 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు మొదలవుతాయని చెప్పారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సం సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా తనను అభినందిస్తూ సందేశం పంపడం చాలా సంతోషం కలిగించిందని, ఈ నాలుగేళ్లుమరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఈ మెసెజ్ తనకు ఒక బూస్ట్‌గా పనిచేస్తుందని శ్రీధర్‌రెడ్డి అన్నారు. సీఎం స్ఫూర్తితో నెల్లూరు రూరల్ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అరవ శాంతి, మాజీ మేయర్ భానుశ్రీ, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కనెక్షన్లు, కరెంట్ కోతలు, సూర్యఘర్ పనుల పురోగతి పై సమీక్ష

సరఫరాను అందించాలని ఆదేశించారు. అప్రకటిత కరెంట్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే స్థానిక ప్రజలకు ముందస్తు సందేశం అందేలా చూడాలని తెలిపారు. విద్యుత్ శాఖలో పెండింగ్ పనులపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరా తీశారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై సీఎండీలతో చర్చించిన మంత్రి... ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మరో వైపు క్షేత్ర స్థాయిలో పీఎం సూర్యఘర్ పై ప్రజల్లో అవగాహన కల్పించి, పునరుత్పాద విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఇటీవల మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి హాజరుకాగా, మరో ఇద్దరు సీఎండీలు వర్చువల్‌గా హాజరయ్యారు.

# ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ చేసిన కలెక్టర్



పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పనిచేసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత ఉపాధి హామీ పదకం సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట డ్వామా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి లోకేష్















కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# ఒప్పంద జిఓల అమలుకు 20న సమ్మె

# ఆశాల నియామకం ప్రభుత్వమే చేపట్టాలి

## ఆశా వర్కర్లకు జాబ్ చార్ట్ రూపొందించాలి
## ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సదస్సులో వక్తలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 'మాతా శిశు సంరక్షణ ' సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వ ఒప్పందం ప్రకారం జిఓలు అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేసారు. గురువారం నాడు స్థానిక కాపు కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా సదస్సు నిర్వహించారు. 14 ఏళ్ల పాటు జీతం, నాతం లేకుండా వెట్టి చాకిరీ చేసి, ఆందోళన ఫలితంగా సాధించుకున్న ఒప్పంద జిఒల అమలుకు మే 20 న జాతీయ సమ్మెలో భాగస్వాములు కావాలని సదస్సు పిలుపునిచ్చింది. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఇరవై ఏళ్ల క్రితం కేవలం యాభై, వంద రూపాయల ఇన్సెంటివ్ కోసం నియమితులైన 'ఆశా వర్కర్ల' సేవలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకున్ననూ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' గుర్తించిందన్నారు. కోవిడ్ కాలంలో 'సామాజిక భాధ్యత' గా వీరు అందించిన సేవలపట్ల ప్రజలు ప్రశంశించినట్లు పేర్కొన్నారు.జీతాలు లేని తొలినాళ్లలో సయితం వీరి సేవల వల్ల ' మాతృ శిశు మరణాలు తగ్గాయని కుటుంబ నియంత్రణ సమగ్రంగా అమలయినట్లు గా ' ప్రపంచ ఆరోగ్య సంస్థ' ప్రకటించిందని ఈ సందర్భంగా గుర్తు చేసారు. గత ఇరవై ఏళ్ళుగా ఆశాలు ఎన్ హెచ్ఎం విభాగం లో ఆరోగ్య సేవలు అందిస్తున్నారని,' ప్రతి కానుపు' ఆసుపత్రి లో జరిగే లాగున సేవలందిస్తున్నట్లు విశ్లేషించారు. ఆశాల జీతాల కోసం 2007 లో యూనియన్ ఏర్పడినాటి నుంచి ఉద్యమం చేపట్టిన ఫలితంగా చంద్రబాబు ప్రభుత్వం రూ 3000 అనంతరం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రూ 10000 లు గౌరవ వేతనం దక్కినట్లు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆశాల ఉద్యమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఆశాల సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆశా వర్కర్లపై ఏఎన్ఎం స్థాయి మొదలు ఉన్నతాధికారుల వరకు కర్ర పెత్తనం సాగుతుందని నిర్దిష్టమైన పని విధానం రూపొందించకపోవడం విచారకరమన్నారు. నిర్దిష్టమైన పనిగంటలు సెలవులు అమలు కాకపోవటం, ఉద్యోగ భద్రత, పిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపించారు. మరో వైపు కొత్తగా ఏర్పడిన 'వెల్నెస్ సెంటర్లో' పనిచేయాలని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఇల్లిల్లు తిరిగి సర్వే చేయమని ఒత్తిడి పెరిగాయని పేర్కొన్నారు. ఇటు సిబ్బంది, అటుఅధికారులు ఒత్తిడితో ఆశా వర్కర్లు మానసిక ఆందోళన గురవుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఆశా వర్కర్ మరణించినా, రిటైర్ అయినా ఎటువంటి ఆర్ధిక సహాయం అందటం లేదన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ,పిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలని నిర్దిష్టమైన జాబ్ చార్ట్ రూపొందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు మే 20 న సమ్మె లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు హక్కుల సాధన కోసం చేపట్టే ఉద్యమాలకు అధికారుల అనుమతి అవసరం లేదని ఆశాలకు సూచించారు. ఆధునిక బానిసలుగా చేసే కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన మాట్లాడుతూ ఆశాలు వేతనాల లేకుండా 14 ఏళ్ళు పని చేసారని, 14 ఏళ్ల ఉద్యమం ద్వారా వేతనాల తో పాటు 'ఆశా వర్కర్లుగా గుర్తింపు పొందామన్నారు. ఉద్యోగ భద్రత కోసం మరోసారి ఉద్యమం చేపట్టాలని సూచించారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ 'ఆశా వర్కర్ల 'ఉద్యమానికి తాము అండగా నిలుస్తామని ప్రకటించారు. యూనియన్ జిల్లా నాయకురాలు పరిశుద్ధం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిఐ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్,ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్లు అరుణ, అనూష, సిఫోరా, విజయ, కోటేశ్వరి, నాగమ్మ, విశ్రాంతమ్మ, సుశీల, బాలమ్మ,అరుంధతి జిల్లా నలు మూలల నుంచి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# భారతదేశ సైనికశక్తి ప్రపంచానికి అర్థమైంది

## బిజెపి నేత మిడతల రమేష్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

మోడీ దేశప్రతిష్ట దిగజార్చాడు ..ట్రంప్‌కు మోకరిల్లాడని కాంగ్రేడ్లు చేస్తున్న ప్రచారాన్ని బిజెపి నేత మిడతల రమేష్ ఖండించారు. పార్టీ కార్యాలయంలో రమేష్ మాట్లాడుతూ భారతదేశ సైనికశక్తి ప్రపంచానికి అర్థమైందని, అంతర్జాతీయ వార్తా సంస్థలలో ప్రచారం జరుగుతుంది. కానీ ఇక్కడ మాత్రం దేశ ప్రతిష్ట దిగజారిందని కామ్రేడ్లు ప్రచారం చేస్తున్నారు. నిలబడి ఉన్న ట్రంప్‌కు మోకాల మీద కూర్చున్న మోడీ చిత్రాలను సామాజిక ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో కామ్రేడ్ల విలేకరుల సమావేశాలలో కేంద్ర ప్రభుత్వాన్ని మోడీని దునియాడుతున్నారు మోడీ మోకరిల్లితే భారత సైనికులు ఉగ్రవాదులను హతమార్చడం ఆపివేసేవారు. ఈరోజు కూడా ఉగ్రవాదులను మన సైనికులు కాల్చి చంపిన విషయాన్ని గుర్తించాలి. పాక్ ఉగ్రవాదులు టూరిస్టులను మతం పేరుతో చేసిన మారణ హోమానికి ప్రతీకారం తీర్చుకుంటామని మోడీ చెప్పారు. ఆ లక్ష్యంగానే సామాన్య పౌరులను చంపకుండా ఉగ్ర వాదులను అంతమొందిస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ జరుగుతున్న సమయంలో పాక్ కిరాన్హిల్స్ న్యూక్లియర్ కేంద్రంలో రసాయనాలు లీకేజ్ కావడం జరిగిందనీ అంతర్జాతీయ పత్రికలలో వార్త కథనాలు వచ్చాయి. పదో తేదీ అమెరికా వైట్ హౌస్ కు పాకిస్తాన్ ఈ సమాచారం తెలిపింది. యుద్ధ నివారణ కోసం ట్రంప్ భారత ప్రధానితో మాట్లాడారు. అమెరికా న్యూక్లియర్ విమానం..

ఈజిప్ట్ న్యూక్లియర్ విమానం పాకిస్థాన్‌లో ల్యాండ్ అయినట్లు అంతర్జాతీయ ఎయిర్ ట్రాకింగ్ సిస్టంలో నమోదయింది. పాక్ కిరాణాహిల్ న్యూక్లియర్ కేంద్రంలో లీకేజ్ అవుతున్న రేడియేషన్ తగ్గించే పనులు ఇప్పటికీజరుగుతున్నాయనీ అంతర్జాతీయ సంస్థలు ప్రచురిస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పత్రికలు ఈరోజు ధ్రువీకరించాయి. పాక్ ఉపయోగించిన ఆయుధాలు అన్ని నిర్వీరమై పోతుండటంతో .పాక్ న్యూక్లియర్ బాంబులు ప్రయోగించడం తప్ప మరో మార్గం లేదు. పాక్ సైనికులతో కలిసి టర్కీ సైన్యం యుద్ధంలో పాల్గొంటుంది.. పాక్ చెడ్డ దేశమైనా సరే మా మద్దతు ఉంటుందని చైనా యుద్ధాన్ని ప్రేరేపిస్తూ ఉంది. చైనా సహకారంతో న్యూక్లియర్ యుద్ధం జరిగితే భారత్లో లక్షలాది సాధారణ పౌరులు మరణిస్తారు. ఆ విషయాన్ని కామ్రేడ్లు గుర్తించడం లేదు. భారత పౌరుల ను కాపాడుకుంటూ ఉగ్ర మూఖలను అంతం చేయడం లక్ష్యంగా మోడీ సర్కార్ నిర్ణయాలు కొనసాగుతున్నాయి. ఇంతలోనే కామ్రేడ్లు భారత్ ప్రతిష్ట దిగజారిపోయిందని ప్రచారం మొదలుపెట్టారు. ఒక్కసారి ప్రపంచ దేశాల పత్రికలు భారత్ ను ఏ విధంగా ప్రశ్నిస్తున్నాయో కామ్రేడ్లు గమనించవలసిందిగా మనవి చేశారు.దేశ ప్రతిష్ట పెరిగిందని ప్రపంచం చెబుతుంటే. భారత ప్రతిష్ట దిగజారిందని కామ్రేడ్లు చెప్పడం విడ్డూరంగా ఉందని రమేష్ అన్నారు. ఈ సమావేశంలో మింగా కిరణ్ కుమార్ చింత గింజల సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

# అందరికీ ఇళ్లు పథకంలో పేదలు దరఖాస్తు చేసుకోవాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్, నోడల్ అధికారి కొల్లాబతుల కార్తీక్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

అందరికీ ఇళ్ళు పథకంలో పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ,నోడల్ అధికారి కొల్లాబతుల కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ,ఇల్లు నిర్మించాలని నిర్ణయం తీసుకుందన్నారు .ఈ పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు , నగర, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికీ ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు పొందిన వారికి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, పట్టణ ప్రాంతాల్లో టిడ్కో లేదా యుఎల్‌బీ ఇల్లు మంజూరు చేస్తారన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేకపోతే ప్రభుత్వం భూములు సేకరించి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జీవితకాలంలో ఒక కుటుంబానికి ఒకసారి మాత్రమే ఇంటి స్థలం ఇవ్వబడుతుందని,ఒకసారి స్తలం పొందినవారు మరలా పొందకుండా ఆధార్ ,రేషన్ కార్డు స్థలానికి లింక్ చేయ బడుతుందనీ అన్నారు. ఇల్లు మంజూరైన రెండు సంవత్సరాల్లో ఇంటిని నిర్మించుకోవలసి ఉంటుందన్నారు. ఇంటి స్థలం పొందాలంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని రాష్ట్రంలో ఎక్కడ ఇల్లు కానీ స్తలం కాని ఉండ కూడదనీ ,గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఇల్లు పొంది ఉండకూడదన్నారు. మెట్ట భూమి ఐదు ఎకరాలు పైగా, మాగాణి 2.5 ఎకరాల పైగా ఉన్నవారు అర్హులు కారని తెలిపారు. లబ్ధిదారులు వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని , క్లైయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కోసం అధికారులు జాబితా గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. గ్రామ/ వార్డు సభ లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు. లబ్ధిదారుల జాబితా జిల్లా కలెక్టర్ ఆమోదం అనంతరం సంబంధిత తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు పంపబడతాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జిల్లా స్థాయిలో వీటిని పరిశీలించడానికి కమిటీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 1221 దరఖాస్తులు, పట్టణ ప్రాంతాల్లో 417 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇంకా అర్హులైన పేదలు ఇళ్ల స్థలాల కోసం త్వరగా దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ కోరారు.

# 20న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరసన

## కార్యక్రమాలు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

ప్రధాని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని, సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక నిర్ణయించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు పత్రికలకు తెలియజేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను మోడీ ప్రభుత్వం బలహీనపరిచి నాలుగు కోడ్లుగా మార్చిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి వనరులను విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని అన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామన్న మాట మార్చాలని ధరల తగ్గింపు లేకపోగా నిత్యవసర వస్తువుల ధరలు నింగినంటుతున్నాయని అన్నారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు చట్టం తెస్తామని చెప్పి వ్యవసాయాన్ని కార్పొరేట్ ఫరం చేస్తున్నారని అన్నారు. ఆహార భద్రత చట్టాన్ని నీరుగార్చి ప్రజా పంపిణీ ని పలుచన చేస్తున్నారని అన్నారు. వామపక్షాలు వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టానికి క్రమంగా నిధులు తగ్గించి మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. దేశంలోని ఆర్థిక సంక్షోభం నివారించబడాలన్న, పేదరికం, అధిక ధరలు, నిరుద్యోగ సమస్య లాంటివి నివారించబడాలన్న ప్రజల కొనుగోలు శక్తి పెరగాలని వారు అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదలకు ఉపాధి హామీ లాంటి చట్టాలు మేలైన మార్గమని దేశంలోనీ ఆర్థిక వేత్తలు చెబుతున్న మాటలు మోడీ చెవికెక్కక పోవటం విచారకరమని అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఏడాదికి రెండు లక్షల 50వేల కోట్లు ఉపాధి హామీకి కేటాయించడం ద్వారానే దేశం ఆర్థిక సంక్షోభం నుండి బయటపడుతుందని వారు అన్నారు. మోడీ ప్రభుత్వం అన్యాయంగా కేవలం 69 వేల కోట్లు మాత్రమే ఉపాధి కేటాయించిందని ఆ చట్టాన్ని క్రమంగా నిర్వేరం చేసే చర్యలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 20వ తేదీ జరిగేటువంటి సార్వత్రిక సమ్మె, దానికి మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నిరసన కార్యక్రమాలు మోడీ ప్రభుత్వానికి ఒక హెచ్చరికలా ఉంటాయని వారు అన్నారు. సమ్మెకు మద్దతుగా జరిగే నిరసన కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల ధర్నా







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 15)

ఒకటో పొగాకు వేలం కేంద్రం వద్ద గురువారం పొగాకు రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని వేలంకేంద్రం సమీపంలో పొగాకు రైతులు ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ పొగాకు కంపెనీలు ఒప్పందం చేసుకున్న విధంగా పొగాకును కొనుగోలు చేయాలని, పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని, ఒక్కొక్క బ్యారన్‌కి దాదాపు 7, 8 లక్షలు ఖర్చు అవుతుందని క్యూరింగ్‌కి, గ్రేడింగ్‌కి, రైతు కూలీలకి మొత్తం సంబంధించి ఎక్కువగా ఖర్చు అయిందని ఇలా అయితే రైతులకు కనీసం అసలు కూడా రాదని, రాష్ట్ర ప్రభుత్వం, ఐటిసి కంపెనీ వారు చొరవ తీసుకొని పొగాకు కు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కేజీ మస్తాన్, వైసిపి నాయకులు, మండల, నియోజకవర్గం, రైతులు పాల్గొన్నారు.

# 16వ ఆర్థిక సంఘ సమీక్షలో పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

గురువారం తిరుపతి పట్టణంలో జరిగిన 16వ ఆర్థిక సంఘ సమీక్ష సమావేశంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. సదరు సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్‌కి అదనంగా ఫండ్స్ ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా 16 ఆర్థిక సంఘం నెంబర్ సౌమ్యకాంతి ఘోష్ వారికి విన్నవించారు. ఈ సమీక్ష సమావేశంలో గౌరవ 16వ ఆర్థిక సంఘం వారు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సిడిఎంఏ, వివిధ కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 15)

మార్కాపురం పట్టణ ఎస్ఐ సైదు బాబు గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ రైడింగ్‌లో 5 మంది పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 45 వేలు జరిమానా విధించారు. పట్టణ ఎస్ఐ సైదు బాబు వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 5 మంది పట్టుబడ్డారు. వారందరిని కోర్టులో ప్రవేశపెట్టగా జూనియర్ సివిల్ జడ్జి యం బాలాజీ నలుగురికి రూ.40 వేలు, ఒకరికి ఐదు వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ విరాళం పంపిణీ



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మే 15)

గిద్దలూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గిద్దలూరు మండల అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. గిద్దలూరు మండలంలోని మండల ప్రాథమిక పాఠశాల,వెంకటాపురంలో ఉపాధ్యాయుని గా పనిచేస్తూ అనారోగ్య కారణంగా మరణించిన పాలుగుళ్ళ కిరణ్ కుమార్ రెడ్డి యొక్క కుటుంబ సభ్యులకు కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ విరాళం రూ.2 లక్షలను సంఘ నాయకులు వారి కుటుంబ సభ్యులకు అందజేసి స్వర్గీయ కిరణ్ కుమార్ రెడ్డితో వారికున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ కిరణ్ కుమార్ రెడ్డి సంఘ పరమైన కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొని సంఘ అభివృద్ధికి కృషి చేశారన్నారు. వీరి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థికపరమైన విషయాలకు తమ యూనియన్ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారారణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు రమణారెడ్డి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, రాచర్ల మండల ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, సంఘ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమ్మనబ్రోలులో మంత్రి లోకేష్‌ను కలిసిన పొగాకు రైతులు



(షణ్ముఖ వెలుగు, అమ్మనబ్రోలు, మే 15)

పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ పలువురు రైతులు మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. అమ్మనబ్రోలులో వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన లోకేష్‌ను పొగాకు రైతులు కలుసుకొని తమ సమస్యను తెలియజేశారు. వెంటనే మంత్రి లోకేష్ వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు కు ఫోన్ చేసి పొగాకు రైతుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై అవసరమైతే కేంద్ర పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడాల్సిందిగా సూచించారు. దీనికి అచ్చంనాయుడు స్పందిస్తూ ధర పెంపు విషయమై ఇప్పటికే పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు, బోర్డు అధికారులతో మాట్లాడుతున్నానని చెప్పారు. 20 కి.మీ. లోపు రవాణా చార్జీలను చెల్లించేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చూడాలని మంత్రి లోకేష్ కోరారు.

## ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

ఒంగోలు ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ఆఫీస్ ఆవరణలో సీనియర్ మేనేజర్ డిపో, ఎఫ్ సి ఐ, తంగరాజు సహకారంతో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు,




లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి నిర్వహించిన వైద్య శిబిరం నందు ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా ఉద్యోగులు, కుటుంబ సంభ్యులు సుమారు 60 మందికి షుగరు, బి పి, బి ఎం డి, సిర్పి, ఆర్ఏ ఫాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ క్యాంపు నందు వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి డాక్టర్ ఉల్చి జయవర్ధన్, ఎండోక్రినాలోజిస్ట్, డయాబెటాలాజిస్ట్ , డాక్టర్ వేమవరపు మహేష్, ఇన్ఫెక్షన్ , సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు మరియు మందులు అందించడంలో ఉపాస్ హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందని డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్ , డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియ చేశారు. హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరం అవుతుందని ఉపాస్ హాస్పిటల్ వైద్య బృందం తెలిపారు. హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నందు వెంకటేష్ బాబు, ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెట్రాలజీ వారోత్సవాలు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

మెట్రాలజీ శాఖ స్థాపనకు 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ డీలర్లతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం నెల్లూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, నెల్లూరు , ఇన్స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ, నెల్లూరు పాల్గొని డీలర్లకు అనేక కీలకమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా డీలర్లకు క్రింది అంశాలపై అవగాహన కల్పించబడిందన్నారు. ప్రతి డెలివరీ బాయ్, సిలిండర్ను వినియోగదారులకు ఇవ్వడానికి ముందు తప్పనిసరిగా బరువు చూపాలి. వినియోగదారులు అడగకపోయినా బరువు చూపించాల్సిన బాధ్యత డెలివరీ బాయ్‌దేనన్నారు. డెలివరీ బాయ్స్ టిప్పులు, అదనపు వసూళ్లు (ఓవర్చార్జ్) కోరకూడదు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం, అమరావతి నుండి నేరుగా మానిటరింగ్ జరుగుతున్నది. అందువల్ల డీలర్లు తమ సిబ్బందిని కట్టుదిట్టంగా నియంత్రించాలి. ప్రతి ఎల్పీజీ డీలర్ లేదా బరువు కొలతల పరికరాలను వినియోగించే ప్రతి యూజర్ తప్పనిసరిగా ఏపీ ఇండస్ట్రీస్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఎంటర్‌ప్రైనర్‌గా నమోదు చేసుకోవాలి. రిన్యూవల్ లేదా కొత్తగా లైసెన్సుల కోసం ఇదే మార్గం తప్పనిసరన్నారు. డీలర్లు ప్లాంట్ నుండి సిలిండర్లను అందుకుంటున్న సమయంలో వాటి బరువును తప్పనిసరిగా తనిఖీ చేయాలి. తక్కువ బరువున్న సిలిండర్లను వెంటనే పక్కన పెట్టి, ప్లాంటుకు తిరిగి పంపించాలి లేదా మరుసటి రోజే పంపించేలా చర్యలు తీసుకోవాలి. 19 కిలోల సిలిండర్లపై ధర ట్యాగ్, బరువు ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతి డీలర్ తాను వాడే తటస్థ పిమ్మటీ బరువు యంత్రం గరిష్ట సామర్థ్యంలో కనీసం 1/10 వంతు బరువులుగా కాస్ట్ ఐరన్ డెడ్ వెయిట్లు కలిగి ఉండాలి. ఇది ఆంధ్రప్రదేశ్ లీగల్ మెట్రాలజీ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2011 లోని రూల్ 23(5) ప్రకారం తప్పనిసరి. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా డీలర్లు చట్టబద్ధమైన విధులను పాటించాలన్న సంకల్పాన్ని పునరుద్ధరించారు. వినియోగదారుల హక్కులను కాపాడే దిశగా ఇది ఒక సానుకూల అడుగుగా నిలిచింది.

# మునుపెన్నడూ లేని విధంగా 339 పనులతో సరికొత్త రికార్డు

## జనసేన నాయకులు కిషోర్ గునుకుల

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)



శిలాఫలకాలలో జనసేన నాయకులు వేములపాటి అజయ్ పేరుతో కూటమి నాయకుల సఖ్యతను చాటారు. పిలిస్తే పలికే నాయకులు ప్రజానాయకుడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ అన్న అని జనసేన నాయకులు గునుకుల కిషోర్ అన్నారు. అభివృద్ధికి అవకాశం ఇస్తే అది శ్రీధర్ అన్నే. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నకు నెల్లూరు రూరల్ ప్రాంతమంతా జల్లెడ పట్టారు. రూరల్ ఎక్కడ ఏ అవసరం ఉందో తెలుసుకొని చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా 339 పనులు 6 నెలల్లో పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. నెల్లూరు రూరల్ 21వ డివిజన్,ఉమ్మారెడ్డి గుంట,ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో 339 అభివృద్ధి కార్యక్రమాలు 60రోజల లో పూర్తి చేసిన వాటిలో భాగంగా ఈ డివిజన్ లో ప్రారంబించాల్సిన ఏపి టిడ్కో ఛైర్మన్,జనసేన క్రమశిక్షణా విభాగం హెడ్,నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేముల పాటి అజయ్ కొంత అస్వస్థత తో రాకపోవడంతో ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు కలిసి ప్రారంభించారు. ఇంతకు ముందు ఎన్నడూ ఇటువంటి రికార్డు ఎవరికి సాధ్యపడలేదు.... మరల మరొకరికి సాధ్యపడదు. కూటమి నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ ఎంత అవగాహన తో అభివృద్ధి పనులు ముందుండి నడిపిస్తున్నారు. ఈ రోజు జనసేన తెలుగుదేశం నాయకులు 21 డివిజన్లో దానికి నిదర్శనంగా నిలిచి కూటమి ప్రభుత్వంలో జనసేన ప్రాముఖ్యతను చూపుతుంది. అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తెలిపినట్లుగా మరో 10 సంవత్సరాలు ప్రజల సంక్షేమం కోసం,రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పని చేస్తామని సవినయంగా తెలుసుకుంటున్నాము. రాబోయే మరొక సంవత్సరంలో 1000 కార్యక్రమాలు పూర్తి చేసి మరో రికార్డు సృష్టించాలి కోటంరెడ్డి సోదరులని కోరుకుంటున్నామన్నారు. శ్రీధర్ అన్న ఎలక్షన్లకు ముందు చెప్పారు ఇది మీ ఆఫీసు ఎప్పుడైనా రావచ్చు ఎప్పుడైనా పోవచ్చు అని అదేవిధంగా ఇప్పటికీ సాగుతూ మా అందరికీ అందుబాటులో ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలో రూరల్ కలిసి పనిచేసుకు పోతామన్నారు.

# రమేష్ ఎయిర్ ట్రావెల్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 15)

పట్టణంలోని కనిగిరి రోడ్‌లో కేశినేని రమేష్ ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన రమేష్ ఎయిర్ ట్రావెల్స్‌ను గురువారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీరు ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ ప్రజల మన్ననలు పొందాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ముందుగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి కేశినేని రమేష్ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మేడా మల్లికార్జున, నల్లబోతుల మురళి, అత్తోట మధుబాబు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### వైద్యాధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, వైద్యులకు సూచించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణతో కలసి నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పేషెంట్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ట్రాకింగ్ విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఎన్టిఆర్ వైద్య సేవల కౌంటర్‌ను, రోగుల రిజిస్ట్రేషన్ రూమును సందర్శించి రిజిస్ట్రేషన్ రికార్డ్సను, క్యాజువాలిటి రూములను, అత్యవసర సేవా విభాగంను, ల్యాబ్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, వైద్యులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఒనారియల్ తదితరులు ఉన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 15)

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ జాన్ సుందరం గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలం లోని ప్రజా ప్రతినిదులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## 18న నెల్లూరులో పొట్టిశ్రీరాములు 125వ జయంతి ఉత్సవం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)



రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు స్టోన్ హౌస్ పేటలోని ఎస్ బి ఎస్ కళ్యాణ మండపంలో జరుగుతాయని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్ట్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు 2026 మార్చి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయని తెలిపారు. 18 వ తేదీ నెల్లూరులో జరిగే జయంతి ఉత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# రీహాబిటేషన్ ఎక్విప్మెంట్ పై రివ్యూ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 15)

మండలంలోని ఉప్పలపాడు పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని రాజుపాలెం హెబిటేషన్లో గతంలో ఫ్లోరోసిస్ బాధితులకు రీ హ్యాబిటేషన్ ఎక్విప్మెంట్‌ను అందజేశారు. దీని పై గురువారం రాజుపాలెం హ్యాపీటేషన్ పరిధిలో ఫ్లోరోసిస్ బాధితులకు అందజేసిన ఎక్విప్మెంట్ను జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వేము అనిల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 - 25 స్కూల్ సర్వే కమ్యూనిటీ సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా ఫ్లోరిసిస్ బాధితులైన వారికి 24 వీల్ చైర్స్, 22 వాకర్సు, 21 వాకింగ్ స్టిక్స్, 18 వెస్ట్రన్ కమోడిటీలను అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించారు.. కొత్త ఇన్స్ట్రుమెంట్ కూడా వస్తాయని అవసరమైతే వాటిని కూడా ఫ్లోరోసిస్ బాధితులకు అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా బాధితులు పరిశుభ్రమైన తాగునీరు, ఆహార నియమాలను కచ్చితంగా పాటించాలి అన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ బాధితులకు విటమిన్ సి, విటమిన్ టాబ్లెట్స్‌ను అందజేశారు. అనంతరం ఏఎన్ఎం, ఆశలకు హెల్త్‌ఎడ్యుకేషన్ తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుగుణ కుమార్, అర్బన్ పిహెచ్‌సి డాక్టర్ శరత్ చంద్ర, సూపర్వైజర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.







# రాష్ట్రంలోనే ఒక బెస్ట్ స్కూల్‌గా వీఆర్ హైస్కూల్

## రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

నెల్లూరు నగరంలోని నిరుపేద విద్యార్థుల కోసం విఆర్ హైస్కూల్ ను కార్పొరేట్ తరహా వసతులతో రాష్ట్రంలోనే ఒక బెస్ట్ స్కూల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. గురువారం ఉదయం నగరంలోని వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. తొలగించిన భవనాల స్థానంలో ప్లే గ్రౌండ్ ఏర్పాటుపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. కాపౌండ్ వాల్ పటిష్టంగా నిర్మించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు పేద పిల్లల కోసం నగరం నది బొడ్డులో ఉన్న వీఆర్ హైస్కూల్‌ను పునరుదరిస్తామని చెప్పిన ప్రకారం సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్ సి సీ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా కోన సాగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో నెల్లూరు నగరంలో 94 వేల ఇళ్లు ఉండగా 84 వేల ఇళ్ళు తిరిగానని, పేదపిల్లల చదువుల దుస్థితి స్వయంగా చూసిన తరువాత వాళ్లందరికీ కార్పొరేట్ తరహాలో విద్యాలయం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానని, ఆ మేరకు హామీని నిలబెట్టుకుంటున్నట్లు చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువవున్న పిల్లలకే ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. ఏడాదికి వెయ్యిమందిచొప్పున ఐదేళ్లకు ఐదువేల మంది పేదపిల్లలకు అడ్మిషన్ కల్పిస్తానన్నారు. స్కూల్ కు దగ్గరగా ఉన్న 6 నుండి 10 తరగతులు చదివే పిల్లలకు సైకిల్స్ ఇస్తామని ,మరి కొంత మందికి ఉచిత ట్రాన్స్పోర్ట్ కల్పిస్తామని, ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఉచిత పౌష్టికాహారం అందిస్తామన్నారు. కార్పొరేట్ ను తలదన్నే రీతిలో సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. పాడుబడ్డ భవనాలు తొలగించి ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నెలాఖరు లోపు పనులన్నీ పూర్తవుతాయన్నారు.జూన్ 12 నాటికి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలోనే మోడల్ స్కూల్‌గా విఆర్సీ రూపాంతరం చెందబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, స్థానిక నాయకులు ,కార్యకర్తలు,ఎన్సీసీ, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అందరూ బాధ్యతాయుతంగా పార్టీకి పనిచేయండి

ఇకపై పనిచేసిన వారికే గుర్తింపు

టీడీపీలో వర్గాలకు తావు లేవు

అందరూ టీడీపీ కుటుంబ సభ్యులమే

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 15)

పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని, ఇక పై పని చేసిన వారికి మాత్రమే పార్టీలో గుర్తింపు ఉండడంతో పాటు పదవులు వస్తాయని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అధ్యక్షతన గురువారం నగరంలోని బృందావనం ఫంక్షన్ హాల్ నందు ఒంగోలు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ టిడిపిలో గ్రూపు రాజకీయాలకు తావు లేదని మనమంతా టిడిపి కుటుంబ సభ్యులమేనని పేర్కొన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న విభేదాలు ఉంటే కుటుంబ సభ్యుల్లా కలిసికట్టుగా కూర్చొని సమస్యను పరిష్కరించుకుందామని తెలిపారు. గత ఎన్నికల్లో టిడిపికి వచ్చిన మెజార్టీ పై పంచాయతీల వారీగా పోలింగ్ బూత్ లో వచ్చిన ఓట్ల సంఖ్యను కార్యకర్తల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేసిన అభివృద్ధి చేసిన పనులను నాయకులు, కార్యకర్తలకు వివరించారు. భవిష్యత్తులో పార్టీకి పనిచేసిన వారికీ పదవల్లో గుర్తింపును ఇస్తామని తెలిపారు. పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో 14 పంచాయతీలకు నూతన గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగినది. మండల పార్టీ అధ్యక్షుడిగా గుండపనేని శ్రీనుని, మండల తెలుగు యువత అధ్యక్షులు గా వలేటి రాంబాబుని, 13 అనుబంద సంఘాల అధ్యక్షులును ఎన్నుకున్నారు. మండల క్లస్టర్ కన్వీనర్‌గా నల్లమోతు బాల గంగాధర్ ని నియమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరయ్య చౌదరి హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి

## నారా లోకేష్ తో మహిళలు



(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, మే 15)

మండలంలోని అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్య చౌదరి 22.04.25వ తేది మృతి చెందిన కారణంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు అమ్మనబ్రోలు గ్రామానికి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం గ్రామంలోని వారి ఇంటి వద్దకు వచ్చారు. ముప్పవరపు వీరయ్య ఇంట్లో జిల్లా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి వారి ఇంటిలో వారితో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు,మీ కుటుంబానికి అన్ని విధాల అన్ని విషయాల్లో పూర్తిస్థాయిలో అండగా ఉంటానన్నారు. వీరయ్య చౌదరి యువగళం పాదయాత్రలో సహకరించిన విధానం, ఆయనతో ఉన్న సన్నిహిత బంధాన్ని గురించి కుటుంబ సభ్యులతో చర్చించారు. మీరు కోరుకున్న విధంగా అన్ని విషయాలలో రాజకీయంగా, కుటుంబ పరంగా అండగా ఉంటాము అని అన్నారు. అనంతరం ఇంటి నుండి బయటకు వచ్చిన తర్వాత అక్కడ ఉన్న సన్నిహితులు బంధువులు మంత్రి లోకేష్‌ని వీరయ్య చౌదరి కేసులో అసలు నేరస్తులను వదిలేసి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు అని ప్రశ్నించగా అందుకు సమాధానంగా ప్రస్తుతం జరుగుతున్నది ప్రాథమిక దర్యాప్తు మాత్రమే అని వీరయ్య చౌదరి కేసులో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నేరస్తులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించే విధంగా అన్ని విధాలా అండగా ఉంటాను పోలీసు వారు కేసు విషయంలో అన్ని విషయాలలో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నేరస్తులను శిక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అనంతరం ఇంటి నుండి బయటకు వచ్చిన తర్వాత ఉదయం నుంచి అధిక సంఖ్యలో వేచి ఉన్న మహిళలు , పార్టీ నాయకులు, కార్యకర్తలు వద్దకు వెళ్లి మాట్లాడలేదని ఒక్కసారిగా మహిళలు అందరూ బలవంతంగా పోలీసు వారిని సైతం నెట్టుకుంటూ వీరయ్య చౌదరి కుటుంబానికి న్యాయం చేయాలని దోషులను శిక్షించాలి అని, అసలు దోషులను పట్టుకొని శిక్షించాలి అని నినాదాలు చేస్తూ మంత్రి లోకేష్ వాహనం వెంట పడ్డారు. ఆ సమయంలో సదరు మహిళలను పోలీసు వారు కంట్రోల్ చేయలేక పోయారు.



# గ్రంధాలయ విజ్ఞానం పుస్తక ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)

ఆంధ్ర ప్రదేశ్ గ్రంధాలయ పునర్వికాస వేదిక, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం సంయుక్త కలెక్టర్ ఛాంబర్ లో గ్రంధాలయ విజ్ఞానం వ్యాస సంకలనం ఆవిష్కరణ నిర్వహించారు.జిల్లా సంయుక్త కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ పుస్తకం ఆవిష్క రించి తొలిప్రతి కేంద్ర గ్రంధాలయం కార్యదర్శి కె కుమారరాజ కు అంద చేశారు. పుస్తకం గురించి వివరిస్తూ గ్రంధాలయ పునర్వికాస ఉద్యమ వేదిక నెల్లూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య ఈ పుస్తకంలో గ్రంధాలయ చరిత్ర,అలనాటి గ్రంధాలయ ఉద్యమాలు,ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖుల పరిచయాలు, గ్రంధాలయ చట్టం, ప్రజాగ్రంధాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనం ప్రాధాన్యత తదితర అంశాలపై విలువైన వ్యాసాలు ఉన్నాయి అన్నారు. పునర్వికాస వేదిక గౌరవ సలహాదారు ప్రసిద్ధ అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ గ్రంథాలయాలు జ్ఞాన సౌధాలు, జాతి అభివృద్ధికి సోపానాలు, వాటిని పరిరక్షించు కోవలసిన భాధ్యత మన అందరిది అని తెలిపారు. నెల్లూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకాలంలో గ్రంథాలయ ఉద్యమ పాత్ర చరిత్రాత్మకం అంటూ మరో వుద్యమం ఇప్పుడు కావాలని ఆశించారు. పునర్వికాస వేదిక జిల్లా సభ్యులు ఐనకోట రవికుమార్, యర్రబత్తిన మునీంద్ర పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్, బాలకృష్ణతో చీఫ్ విప్ జీవీ, మక్కెన సమావేశం





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 15)

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు గురువారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి నివాసం ఉండవల్లిలో ఈ మేరకు వారిద్దరిని కలిశారు. మంత్రి లోకేష్‌కు ఒక మొక్కను బహుకరించారు. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వారిద్దరిని ప్రత్యేకంగా కలవాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నామని, ఈ రోజు కుదరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన విషయాలతో పాటు వినుకొండ నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాల విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు.

# డక్కిలిలో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





(షణ్ముఖ వెలుగు, డక్కిలి, మే 15)

పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రలయం వారి సహకారంతో డక్కిలి మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశామని మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరిశంకర్, సీఈవో సీతారాం నాయుడు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. డక్కిలి మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలకు సీనియర్ వైద్య నిపుణులైన అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్లు డాక్టర్ మానస, డాక్టర్ నిహారిక ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం లో 205 మంది కి పరీక్షలను ఉచితముగా నిర్వహించి 70 మంది కి ఉచితముగా మందులు పంపిణీ, 30 రోగులకు ఉచిత కంటి అద్దాలు, 70 మంది కి ఉచితంగా ఆపరేషన్ లు చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు తిరుపతి జిల్లాలలోని ప్రతి మండల కేంద్రంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ ఉచిత శిబిరాలను కంటి సమస్యలతో బాధపడేవారు ఉపయోగించుకోవాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఎఐ కృష్ణ గల్లా, అరవింద్ నేత్రలయ సిబ్బంది జీవన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు కోసం వచ్చిన ప్రజల కొరకు ట్రస్ట్ వారు భోజనం ఏర్పాటు చేయడం జరిగింది.

వెలుగు
ePaper www.shanmukhavelugu.com


## టీడీపీ కూటమి పాలనలో వ్యవసాయ శాఖకు ఊపిరి

**వెంకటాచలం మండలంలో 30 మంది రైతులకు పవర్ స్ప్రేయర్లు, ఇద్దరికి బ్రష్ కట్టర్లు అందజేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)**

వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ శాఖను మూతేశారు. దేశమంతా అమలైన అనేక వ్యవసాయ పథకాలు ఏపీ రైతులకు అందకుండా పోయాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ వ్యవసాయ శాఖలో యాంత్రీకరణ ప్రారంభమైందన్నారు. ఒక్కో పవర్ స్ప్రేయర్ పై రూ.10 వేలు, బ్రష్ కట్టర్ పై 17,340 సబ్సిడీ ఇచ్చారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

## తిరుమల శ్రీవారి సేవలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్

**కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) దంపతులు**



**(షణ్ముఖ వెలుగు, తిరుమల, మే 15)**

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) మాధురి రత్న ఆండాళ్ దంపతులు వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకున్న వారికి రంగనాయకుల మండపంలో వేద పండితులు శేష వస్త్రం కప్పి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పైన జగ్గంపేట నియోజకవర్గ ప్రజల పైన ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకన్నామని తెలిపారు.

## నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 339 అభివృద్ధి పనుల ప్రారంభం

**22వ డివిజన్‌లో రూ.50 లక్షలతో తారు రోడ్డుకు శంకుస్థాపన**

**నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఒకేసారి 339 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతున్న సందర్భంలో, 22వ డివిజన్‌లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన తారు రోడ్డును బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ సీపా రెడ్డి వంశీధర్ రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మూలె విజయభాస్కర్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రబోలు రాజేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగరాల సురేష్, రూరల్ నియోజకవర్గ కన్వీనర్ మండల ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోసూరు బాలయ్య గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా వెంకటరమణ, బీవినగర్ మండల అధ్యక్షులు గుంజి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 22వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యానాద్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు కొండలరావు, యోగానందం, నక్క సత్యనారాయణ, ఏటూరి ఏడుకొండలు, సింగాల వెంకటేశ్వర్లు, అలాగే బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# మొదటి ఏడాదిలోనే 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం

**ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

**టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన చీఫ్ విప్ జీవీ, మక్కెన**





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 15)**

రాష్ట్రంలో పేదల కోసం మొదటి ఏడాదిలోనే 5లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు అందించే దిశగా ప్రభుత్వ వేగంగా అడుగులు వేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణాల్లో 2లక్షలు, గ్రామాల్లో 3లక్షల ఇళ్లు ఎన్టీఆర్ హౌసింగ్ కింద శరవేగంగా పూర్తి అవుతున్నాయని, త్వరలోనే లబ్దిదారులకు అన్నివసతులతో కూడిన కొత్తఇంటి తాళాలు అంది స్తామన్నారు. వినుకొండ పట్టణంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ పేదలందరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గృహ నిర్మాణాన్ని పరుగులు తీయిస్తున్నారని తెలిపారు. వినుకొండలో మొత్తం టిడ్కో ఇళ్లను 5 నుంచి 6 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 720 ఇళ్లు ఇప్పటికే 90% పూర్తయినట్లు తెలిపారు. 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 864 ఇళు పూర్తి చేసి పేదలకి అందిస్తామన్నారు. 300 చ.అ. ఇంటిపై రూ.6.5లక్షలు, 430 చ.అ. ఇంటికి రూ.8.55 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 2లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేయడానికి రూ.7వేల కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. పేదవాడంటే చులకన, నిర్లక్ష్యం కారణంగానే గత వైకాపా ప్రభుత్వం ఇలా కొత్తఇళ్లు కట్టకపోగా, మంజూరైన ఇళ్లను కూడా రద్దు చేసిందని వాపోయారు. అవినీతిలో ముందు, పేదల చేయూతలో వెనకన నిలిచిన వాళ్లు కేంద్రం నిధులు ఇచ్చినా... రాష్ట్రం వాటా ఇవ్వాల్సి వస్తోందని 51వేల టిడ్కోఇళ్లు రద్దు చేశారని మండిపడ్డారు. పైగా జగన్ నిర్వాకం కారణంగా 77వేల 600మందికి ఇళ్లు ఇవ్వకుండానే రుణాలు తీసుకున్నారని, ఈ ఈఎంఐల కట్టలేక పేదలు ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. గత ప్రభుత్వం కట్టని ఆ అప్పు భారం తీర్చేందుకు ఎన్డీయే ప్రభుత్వ వచ్చాక రూ.140కోట్లు తీర్చుతున్నారని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే 50 నుంచి 90శాతం పూర్తి చేసిన ఇళ్లను ఎందుకు పేదలకు ఇవ్వలేకపోయా రని నిలదీశారు. ఆ నిర్వాకాలన్నీ సరిచేయడంతో పాటు ఇంకా ఇళ్లు లేని వారికి పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చి ఎన్టీఆర్ కాలనీల నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి టిడ్కో ఇంటిని పూర్తి చేసి తీరుతామన్నారు. గృహ నిర్మాణం లో ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. గూడు లేని ప్రతిపేదకు ఇళ్లు అంచాలన్నదే ఎన్డీయే ప్రభుత్వ, సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జున్‌రావు కమిషనర్, అధికారులు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మండుటెండను సైతం లెక్కచేయకుండా జనసైనికుల మజ్జిగ సేవ భేష్

**నెల్లూరు సిటీలో జనసేన పార్టీ డొక్కా సీతమ్మ ఉచిత మజ్జిగ చలివేంద్ర కేంద్రాలు**

**90 రోజులుగా దాదాపుగా 1000 లీటర్ల మజ్జిగ ఉచితంగా పంపిణీ**

**నెల్లూరు కార్పొరేషన్ లిమిట్లో 5 కూడళ్లలో**

**18వ రోజు చిల్డ్రన్స్ పార్క్ సెంటర్**

**జనసేన వీర మహిళ విజయలక్ష్మి గునుకుల ఆధ్వర్యంలో**

**6వ రోజు గాంధీ బొమ్మ సెంటర్ సెంటర్లో జనసేన స్టేట్ నాయకులు వేములపాటి అజయ్ తల్లిదండ్రులు**

**స్వర్గీయ వేములపాటి అనంతరామయ్య, కామేశ్వరి ల జ్ఞాపకార్థం**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 15)**




జనసేన నాయకులు ఏపీ టిడ్కో చైర్మన్, నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు, జనసేన క్రమశిక్షణ విభాగం హెడ్ శ్రీ వేములపాటి అజయ్ గారి సూచనలతో సిటీ పర్యవేక్షకులు కిషోర్ గునుకుల పర్యవేక్షణ లో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని దాదాపు 5 చలివేంద్రాలు నిర్విరామంగా ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తూ వేసవి తాపం తీరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, పవన్ యాదవ్, వెంకట యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఈగి సురేష్ నాయకులు కృష్ణారెడ్డి, వీర మహిళ శాంభవి, కస్తూరి, వరలక్ష్మి, జనసేన నాయకులు నరహరి, అబీద్, తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 15)**

ఇటీవల హత్యకు గురైన టీడీపీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం రోజున ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబోలు గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని హెలిప్యాడ్ వద్ద జిల్లా మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

## పిహెచ్‌సి పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యాధికారి డాక్టర్ డి బిందు ప్రియాంక

**(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 15)**



తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం దక్కిలి మండలం దక్కిలి పి హెచ్ సి లోని వెలికల్లు, మోపూరు గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారిణి డాక్టర్ డి.బిందు ప్రియాంక తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, సర్పంచులు ఎం.వెంకటరమణ, జనార్ధన్, పంచాయతీ కార్యదర్శులు నరసింహులు, సుబ్బరాయులు, స్థానిక నాయకులు సుధీర్ రెడ్డి, సిహెచ్‌ఓ సుకుమారి, సూపర్వైజర్ ఆదిలక్ష్మి, ఎంఎల్ హెచ్ పి యశస్విని, ఏఎన్‌ఎం లు పి.వైష్ణవి, వెంకటరమణమ్మ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com